

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,34,232లు, బంగారం 4 గ్రాముల 950 మిల్లి గ్రాములు వెండి 60 గ్రాముల 600 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



అవతారమూర్తి జగన్నాథుడు

- 8లో



ఛెలిగడ ప్రాజెక్టు పరిశీలన

- 8లో

న్యూస్‌రీల్

వలకు చిక్కిన అరుదైన తాబేలు



వలలో చిక్కిన అరుదైన తాబేలు

భువనేశ్వర్: చిలికా సరస్సులో చేపల వేటకు వేసిన వలలో అరుదైన తాబేలు చిక్కింది. తీరం చేరిన తర్వాత పరిశీలించిన మత్స్యకారులు దీనిని తిరిగి సురక్షితంగా చిలికా సరస్సులో విడిచి పెట్టారు. ఈ తాబేలు బంగారు వన్నెతో అత్యంత ఆకర్షణీయంగా ఉందని మత్స్యకారుల సమాచారం. దీని పైభాగంలో బహుళ రంగులతో పలు గుర్తులు ఉన్నట్లు గుర్తించారు.

సబ్ కలెక్టర్‌గా ప్రభాత్ కుమార్



ప్రభాత్ కుమార్

జయపురం: జయపురం సబ్ కలెక్టర్‌గా సీనియర్ ఒఏఎస్ అధికారి ప్రభాత్ కుమార్ పారిడ నియమితులయ్యారు. హింజిలికట్ తహసీల్దార్‌గా ఉన్న ఆయన ప్రమోషన్‌పై సబ్ కలెక్టర్‌గా జయపురం బదిలీ అయ్యారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన బేదబర ప్రధాన్ మల్క న్‌గిరి జిల్లా అదనపు జిల్లా కలెక్టర్ (ఏడీఏ)గా నియమితులయ్యారు. మల్కన్‌గిరి ఏడీఎం మహేశ్వర చంద్ర నాయిక్‌ను బరగడ సీడీవోగా నియమించారు.

నిందితులను అరెస్టు చేయండి



ఆందోళన చేస్తున్న డీఎస్‌వో సభ్యులు

బరంపురం: బొలంగిర్ జిల్లాలో కొద్ది రోజుల క్రితం జరిగిన విద్యార్థి హత్యకు కారణమైన నిందితులను అరెస్టు చేయాలని ఆల్ ఇండియా డెమోక్రసీ స్టూడెంట్ ఆర్గనైజేషన్(డీఎస్‌వో) రాష్ట్ర అధ్యక్షుడు సోమనాథ్ బెహరా డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం కొమ్మపల్లి జంక్షన్‌లో డీఎస్‌వో గంజాం శాఖ ఆధ్వర్యంలో ఆందోళనకి దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొద్దిరోజుల క్రితం బొలంగిర్ జిల్లాలో మురిబదల్ బ్లాక్ పరిధి కొలియాపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి శాంతి ప్రధాన్‌పై కొంతమంది దుండగులు దాడిచేసి హత్య చేశారన్నారు. దీనికి సంబంధించి నిందితులను అరెస్టు చేయాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డీసీకి వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో జిల్లా అధ్యక్షుడు నిర్మాయి చరణ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలు సందర్శన



జైలు అధికారులతో మాట్లాడుతున్న సమంత జెన

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయసేవా ప్రదీకరణ కార్యదర్శి సుమంత జెన జైలు లీగల్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా జయపురం సబ్ జైలుని ఆదివారం సందర్శించారు. జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వారికి పెడుతున్న భోజనం, వైద్య పరీక్షలు, జైలులో పారిశుధ్యం, వారికి ఇచ్చే దుస్తులు, భద్రత మొదలగు విషయాలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఖైదీలు ఉంటున్న గదులను, జైలు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని జైలు అధికారులకు ఆదేశించారు. భోజనానికి ముందు సబ్బుతో చేతులు శుభ్రపరచుకోవాలని ఖైదీలకు సూచించారు. ఖైదీలకు ఎటువంటి న్యాయ సాయం కావాలన్నా జైలు సందర్శించేందుకు వచ్చే ప్యానల్ న్యాయవాదులకు లేదా పారా లీగల్ స్వచ్ఛా సేవకులకు తెలియజేస్తే, అవసరమైన వారికి న్యాయ సహాయం అందించడం జరుగుతుందన్నారు.

బహుడాకు రథాలు సిద్ధం

- జగన్నాథుని నుంచి అందిన ఆజ్ఞామాల
- దక్షిణాభిముఖంగా రథాలు
- స్వామివారి రాక కోసం నిరీక్షణ

భువనేశ్వర్:

జగన్నాథుని మారుయాత్ర బహుడా మహోత్సవానికి 3 రథాలు సిద్ధమయ్యాయి. రథయాత్ర నుంచి గుండిచా శారదాబాలి ప్రాంగణంలో నిలిచి ఉన్న 3 రథాలను నక్కొఛౌణ ద్వారం వైపు మలుపు తిప్పారు. ఇప్పటివరకు ఉత్తరాభిముఖంగా ఉన్న రథాలు మలుపు తిప్పడంతో దక్షిణాభిముఖమై స్వామివారి రాక కోసం నిరీక్షిస్తున్నాయి. సింహద్వారం నుంచి గుండిచా యాత్రలో స్వల్పంగా పట్టుతప్పిన రథాల పటుత్వాన్ని పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో పరిశీలనలో భాగంగా జగన్నాథుని రథం నంది ఘోష్ చక్రాలకు 4 క్లాంప్‌లు బిగించారు.

మలుపు తిరిగిన రథాలు

అడపా మండపంపై యాత్ర పూజాదికాలు అందుకుంటున్న శ్రీజగన్నాథుని నుంచి ఆజ్ఞామాల అందడంతో రథాలు దక్షిణాభిముఖంగా మలిచే ప్రక్రియ మొదలుపెట్టారు. ఆదివారం మధ్యాహ్నం 2.25 గంటలకు ఆజ్ఞామాల శారదాబాలి ప్రాంగణంలో రథాల వద్దకు చేరింది. పతి మహాపాత్రో సేవాయత్ వర్గాల ఆధ్వర్యంలో దక్షిణ మలుపు కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో తొలుత దేవీ సుభద్ర రథం దర్ప దళన మలుపు తిరిగింది. వెంబడి బలభద్రుని తాళ ధ్వజం ఉత్తర దిశ నుంచి దక్షిణ దిశకు వెనుదిరిగింది. చివరగా జగన్నాథుని నందిఘోష్ రథం దక్షిణాభిముఖమై గుండిచా నక్కొఛౌణ ద్వారం ముంగిటకు చేరింది. రథాల స్థితిగతుల పరిశీలన ముగించి మలుపు తిప్పడం ప్రారంభించారు.

వాన జల్లు

రథాలు దక్షిణాభిముఖంగా మలుపు తిప్పే దృశ్యం వాస్తవ రథయాత్రని తలపింప జేసింది. సాధారణంగా గుండిచా మందిరం అడపా మండపంపై మూల విరాటులను దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తజనానికి ఇదో అపురూప అదృష్టంగా తలపింపజేసింది. పోలీసులు, సేవాయత్ వర్గం నుంచి ప్రతినిధులు రథాలు మలుపు తిప్పడంలో పాలుపంచుకోవడం ఆచారం. ఈ సమయంలో తేలికపాటి వర్షం నిరవధికంగా కురిసింది. ప్రకృతి సహజ నీటి సించనంతో అలుపు తెలియకుండా రథాలు మలుపు తిప్పడం సునాయాశంగా పూర్తి చేశారు. సాధారణ భక్త జనం ఉత్సాహంతో తలో చేయి వేసి పోలీసు, సేవాయత్ వర్గాలతో భుజం భుజం కలిపి రథాల్ని మలుపు తిప్పడంలో పాల్గొని కలిసి వచ్చిన అదృష్టంగా ఆనందపడ్డారు.



రథాలు మలుపు తిప్పుతున్న పోలీసు, సేవాయత్ వర్గాలతో ప్రజలు (ఇన్‌సెట్లో) స్వామివారి ఆజ్ఞామాలతో రథాలకు పూజలు నిర్వహిస్తున్న సేవాయత్‌లు

మంగళ హారతి ఆలస్యం

గుండిచా ఆలయం అడపా మండపంపై జగన్నాథుని దర్శనంతో కోటి జన్మల పుణ్యఫలం లభిస్తుందని విశ్వాసం. అయితే ఈ మండపంపై స్వామివారికి కంటి మీద కునుకు కరువై దైనందిన సేవాదుల్లో జాప్యంతో వేళాపాళాలేని అరకొర నైవేద్యాలతో సర్దుకుంటున్నాడు. గత రెండు రోజులుగా స్వామివారు పవళింపు సేవకు నోచుకోలేదు. అలాగే ఆదివారం మంగళ హారతి ఆలస్యం అయింది. దీంతో ఈ పరిస్థితులపై భక్తుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఉదయం 4 గంటలకు ద్వారాలు తెరిచి, 4.30 గంటలకు అంతరాలయం శుద్ధి నిర్వహణ, 5.30 గంటలకు నిర్వహించాల్సిన మంగళ హారతి దాదాపు 4 గంటల ఆలస్యంగా జరిపినట్లు ఆరోపణ. దీంతో తదుపరి సేవల్లో జాప్యం అనివార్యమైంది. స్వామివారి దర్శనం కోసం గుండిచా బయట బారులుతీరిన భక్తులు గంటల తరబడి వేచి ఉండలేక ఇబ్బందులకు గురయ్యారు.



గుండిచా ఆలయం

రేపు అడపా మండపంపై నవమి దర్శనం

భువనేశ్వర్: గుండిచా మందిరం అడపా మండపంపై మూల విరాటుల నవమి దర్శనం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. యాత్రలో నవమి దర్శనం ప్రాధాన్యత సంతరించుకుంది. సాధారణ దర్శనం కోసం భక్తులు గంటల తరబడి బారులు తీరాల్సి వస్తుంది. అడపా మండపంపై నవమి దర్శనం సంధ్యా దర్శనంగా ప్రతీతి. భక్తులు, యాత్రికులకు ఈనెల 27వ తేదీ మంగళవారం సంధ్యా దర్శనం లభిస్తుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరవధికంగా సంధ్యా దర్శనం కల్పించేందుకు సకల ఏర్పాట్లు చేస్తున్నారు.



అడపా మండపంపై మూల విరాటుల దర్శనానికి బారులుతీరిన భక్తులు(ఫైల్)

28న బహుడా యాత్ర

సంధ్యా దర్శనం మర్నాడు స్వామివారి మారు రథయాత్ర బహుడా అట్టహాసంగా నిర్వహించేందుకు భారీ సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 28వ తేదీన బహుడా యాత్ర విజయవంతం చేసేందుకు యంత్రాంగం నడుం బిగించింది. శ్రీమందిరం పాలక వర్గం, పూరీ జిల్లా యంత్రాంగం, పోలీసు బలగం పటిష్టమైన సమన్వయంతో బహుడా యాత్ర విజయవంతం చేయాలని నిర్ణయించారు. ఈ వర్గాల మధ్య సమన్వయ లోపంతో ఈ ఏడాది రథ యాత్రలో రథాలు సకాలంలో గుండిచా శారదాబాలి గమ్యం చేరలేక పోయాయని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, ఈ పరిస్థితి పునరావృతం కాకుండా అనుబంధ యంత్రాంగం ముందు నుంచి జాగ్రత్త తీసుకుంటోంది.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి అధికారులంతా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ సూచించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయన స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గజపతి జిల్లాలోని ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యంగా ఎన్డీఆర్ఎఫ్, ఓడ్రాఫ్ (ఒడిశా డిజాస్టర్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్) మరియు అగ్నిమాపక దళాలు తుపాన్లు, వరదలు వచ్చినప్పుడు ప్రజల ప్రాణాలను రక్షిస్తున్నారన్నారు. బీడీవోలు తుపాన్ల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి ఆహారం, తదితర సదుపాయాలు అందజేయాలని ఆదేశించారు. జిల్లా అత్యవసర మరియు ప్రకృతి వైపరీత్యాల విభాగం అధికారి ప్రభాస్ బెహురా పవర్ పాయింట్ ద్వారా ప్రెజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్, ఏడీఎం రాజేంద్ర మింజ్, జిల్లా ముఖ్య అభివృద్ధి అధికారి, డీఆర్‌డీఏ రామంచల్ ఖమారీ, సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సేవా కార్యకర్తలు

జయపురం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సోషియల్ ఎన్విరాన్‌మెంటల్ అండ్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్(సేవా) స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కె.సుధాకర్ పట్నాయక్ అన్నారు. జయపురం సమితి గొడొపొదర్ పంచాయతీ ఛటిడిపుట్ గ్రామం నుంచి ఈ ఏడాది మొక్కలు నాటే కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. వందమందికి పైగా గ్రామస్తులు మొక్కలు నాటేందుకు ముందుకు రావడంతో, ఒక్కొక్కరికీ 6 మొక్కలు చొప్పున ఇచ్చి గ్రామ పరిసర ప్రాంతాల్లో నాటించారు. ఈ సందర్భంగా సుధాకర పట్నాయిక్ మాట్లాడుతూ.. జీవరాశి మనుగడకు మొక్కలే మూలాధారమన్నారు. మొక్కలు నాటి అడవులను పెంచడం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలియజేశారు. జిల్లాలో అడవులు తగ్గిపోవడం వలన వాతావరణంలో అనేక మార్పులు జరుగుతూ అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కిల్లంశెట్టి మోహనరావు, మురళీ పట్నాయిక్, జి.వెంకట రెడ్డి, గోపాలసాహు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అక్రమంగా గంజాయి రవాణా

- ఇద్దరు మహిళలు అరెస్టు



పట్టుబడిన మహిళలను చూపిస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా గంజాయి తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. ఘటనపై మునిగుడ ఎస్డీపీవో ఆకాష్ సాహు తెలిపిన వివరాల మేరకు.. గత కొద్ది రోజులుగా మునిగుడ రైల్వేస్టేషన్ నుంచి అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్లు అందిన సమాచారం మేరకు, శనివారం రాత్రి పోలీసులు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ బయట ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా కనిపించడంతో, వారిని ఆపి తనిఖీలు చేయగా రెండు బ్యాగుల్లో 21 కిలోల గంజాయి బయటపడింది. మహారాష్ట్రకు చెందిన కౌసల్య చంద్రకాంత్ (32), రోహిణి లక్ష్మణ్ కొలి (34) అనే ఇద్దరు మహిళలు మునిగుడ నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారని పోలీసులు తెలియజేశారు. అయితే అరెస్టైన ఇద్దరు మహిళల్లో ఒకరు దివ్యాంగురాలు కాగా మరొకరు ఆమె సహాయకురాలు. ఈ నెపంతోనే వారు గంజాయిని తరచూ తరలిస్తున్నట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా.

కుక్కల దాడిలో 15 మేకలు మృతి

పర్లాకిమిడి: స్థానిక గుమ్మా బ్లాక్ జమ్మూరు గ్రామంలో పాలిన అప్పన్న మేకల శిబిరంలోకి ఆదివారం వీధి కుక్కలు చొరబడి దాడి చేయడంతో 15 మేకలు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న యాదవ కులం అధ్యక్షుడు ఎ.కులవర్ధన రావు విచ్చేసి లైవ్‌స్టాక్ ఇన్‌స్పెక్టర్ (జోగిపాడు), ఆర్ఐ నమ్మనగుడలకు సమాచారం ఇచ్చారు. కుక్కల దాడుల్లో మృతి చెందిన మేకలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని కోరారు.



కుక్కల దాడిలో మృతి చెందిన మేకలను పరిశీలిస్తున్న దృశ్యం

పత్రికలు సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలి

రాయగడ:

పత్రికలు సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి అన్నారు. స్థానిక తేజస్వీ సమావేశ మందిరంలో జీటీవీ భారత్ ఆరో వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పాఠకునికి ఉన్నత ప్రమాణాలతో కూడిన వార్తలను అందజేసేందుకు ఎల్లవేళలా కృషి చేయాలన్నారు. ప్రజలకు, ఆధికారులకు మధ్య వారధిలా పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. పాత్రికేయుడు నిరంతరం కొత్తదనంతో ఆలోచించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను వెలుగులోకి తీసుకొస్తే దేశం సమగ్రాభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు అవినాష్ మిశ్రో, సీనియర్ పాత్రికేయుడు బాదల్ కుమార్ థా, జీటీవీ భారత్ కార్యదర్శి రామదాస్ లిమ్మ, ఏడీఎం సోమనాథ్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముదులి వేదికపై బాదల్ థా, మిశ్రో తదితరులు

కొలిక్కిరాని పంచాయతీ సమస్య

- పట్టువీడని రెండు గ్రామాల ప్రజలు

జయపురం: జయపురం సబ్ డివిజన్ కుంద్రా సమితి కెరామటి గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణం వివాదం కొలిక్కిరావడం లేదు. 20 ఏళ్ల క్రితం కెరామటి గ్రామ పంచాయతీని ఏర్పాటు చేశారు. అయితే అప్పటి నుంచి పంచాయతీ కార్యాలయ నిర్మాణంపై రెండు వర్గాల వివాదం వలన పంచాయతీ కార్యాలయం నిర్మించలేదు. కెరమటి పంచాయతీ కాబట్టి కెరమటి గ్రామంలోనే పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించాలని ఒక వర్గం పట్టుబడుతుండగా, పంచాయతీలో అన్ని గ్రామాలకు మధ్యన ఉన్న ఖెందుగుడ గ్రామంలో పంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని మరో వర్గం డిమాండ్ చేస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు సర్పంచ్ మాణిక్ సొంత అధ్యక్షతన గ్రామసభను ఆదివారం ఏర్పాటు చేశారు. ఆ సభలో జిల్లా పంచాయతీ అధికారి జుగళ్ కిషోర్ నాయిక్, పంచాయతీ విస్తరణ అధికారి సురేష్ చంద్రహొత్త, పంచాయతీ కార్యనిర్వాహక అధికారి భూపేష్ జానిలు పాల్గొన్నారు. వారు ఉభయ వర్గాల ప్రజలతో చర్చలు జరిపారు. ఉభయ వర్గాల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అయితే ఆ రెండు వర్గాల ప్రతినిధులు పట్టు వీడలేదు. మరోవైపు పంచాయతీ కార్యాలయం కెరామటి, ఖెందుగుడ గ్రామాల మధ్య స్థలంలో నిర్మిస్తే సమస్య పరిస్కారమవుతుందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే వారి అభిప్రాయానికి సైతం రెండు వర్గాల ప్రజలు ససేమిరా అన్నారు. తమ గ్రామాల్లోనే పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించాలని అధికారులకు స్పష్టం చేశారు. దీంతో కెరామటి పంచాయతీ కార్యాలయ నిర్మాణ సమస్య కొలిక్కిరాక చర్చలు విఫలమయ్యాయి. ఉభయ వర్గాల అభిప్రాయాలపై సమీక్షించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని పంచాయతీ విస్తరణ అధికారి సురేష్ చంద్రహొత్త తెలియజేశారు. సమావేశంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామసభలో కుంద్ర బీడీవో బిచిత్రానంద నాయిక్, తహసీల్దార్ ఆయూబ్ మండల్, పోలీసు అధికారి సమర్పిత స్వైయ్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు రాధాబినోద్ సామంతరాయ్, జిల్లా పరిషత్ సభ్యురాలు కనకలత పెంటియ, సమితి సభ్యురాలు గౌరీ హరిజన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల అభిప్రాయాలు వింటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



గ్రామసభలో పాల్గొన్న ప్రజలు

క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో మా లోకేశ్వరి అమ్మవారు

జయపురం: స్థానిక బ్యాంక్ కాలనీలోని మా లోకేశ్వరి(దుర్గాదేవి) ఆలయ 16వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వందలాదిమంది భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలచే పూజారులు శాస్త్రోత్సంగా యాగ హోమాలు నిర్వహించారు. ఉత్సవాలను తిలకించి తరించేందుకు భక్తులు పోటెత్తారు.

ఎడతెరిపి లేకుండా వర్షం

- అంగుల్‌లో అత్యధిక వర్షపాతం



ఇంటిలోకి చేరిన వర్షపు నీరు

భువనేశ్వర్: అల్ప పీడనం ప్రభావంతో రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. అత్యధిక ప్రాంతాల్లో ఆదివారం వర్షం కురిసింది. తేలికపాటి వర్షంతో కటక్, భువనేశ్వర్ జంట నగరాల్లో పలుచోట్ల వర్షపు నీరు ఇళ్లలోనికి ప్రవహించి జన జీవనం ప్రభావితమయ్యింది. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నమోదైన వివరాల ప్రకారం అంగుల్ జిల్లాలో అత్యధికంగా 152 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. 62 మిల్లీ మీటర్లతో బౌధ్, 57 మిల్లీ మీటర్లతో ఢెంకనాల్, 43.2 మిల్లీ మీటర్లతో హీరాకుద్, 40.2 మిల్లీ మీటర్లతో పూరీ, 38.8 మిల్లీ మీటర్లతో పర్లాకిమిడి, 37 మిల్లీ మీటర్లతో బర్‌గడ్ పట్టణం తదుపరి స్థానాల్లో నిలిచాయి.

ఐదు దేవాలయాల్లో చోరీ



చోరీ జరిగిన త్రినాథ స్వామి ఆలయంలో క్లూస్‌టీమ్ పరిశీలన

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామంలో శనివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఒక్క రోజులోనే ఐదు దేవాలయాల్లో చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు, దేవాలయ అర్చకులు తెలిపిన వివరా లు ప్రకారం.. గ్రామంలో గల ఉమాకామేశ్వరస్వామి, త్రినాథస్వామి, కోదండరామస్వామి, సంతోషి మాత, మందలమ్మతల్లి దేవాలయాల్లో దొంగలు చొరబడి దేవుని ఆభరణాలు, పూజా సామగ్రి, హుండీలోని నగదు, బంగారు కానుకలు దోచుకున్నారు. ఆదివారం ఉదయం ఆలయాలు తెరిచిన అర్చకులకు చోరీ జరిగిన ఆనవాళ్లు కనిపించాయి. ఉమాకామేశ్వరస్వామి ఆలయంలో వెండి కిరీటం, వెండి పంచపాత్ర, వెండి ఉద్ధరిణి, వెండి పళ్లెం, పార్వతీదేవి అమ్మవారికి అలంకరణ చేసిన బంగా రం నేత్రాలు, అమ్మవారి పుస్తెలు, త్రినాథ స్వామి ఆలయంలో స్వామి వారి బంగారు నేత్రాలు తులం, వెండి పల్లెం, ఉద్ధరిణితో పాటు హుండీలోని నగ దు, కోదండరామస్వామి ఆలయంలో స్వామి అలంకరణ చేసిన వెండి కిరీటాలు, వెండి పూజా సామగ్రి సుమారు కిలో వరకు దోచుకున్నట్లు ఆలయ అర్చకులు తెలియజేశారు. మందలమ్మ తల్లి ఆలయం, సంతోషి మాత ఆలయాల్లో హుండీలను పగలగొట్టి అందులో ఉన్న నగదును దొంగలు అపహరించారు. ఈ ఐదు దేవాలయాల్లో చోరీకి పాల్పడిన నగదు, బంగారు, వెండి ఆభరణాల విలువ సుమారు రూ. 4 లక్షల వరకు ఉంటుందని అంచనా. దేవాలయాలకు వేసి ఉన్న తాళాలను పగలగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. గతంలో కూడా ఉమాకామేశ్వర స్వామి ఆలయం, మందలమ్మ తల్లి ఆలయాల్లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులకు విషయం తెలియడంతో క్లూస్‌టీమ్ వచ్చి పరిశీలన చేసి వేలి ముద్రలు సేకరించారు. ఈ చోరీ సంఘటనలపై స్థానిక ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు రేపు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోని హుండీ ఆదాయాన్ని మంగళవారం ఉదయం ఆలయ ఆవరణలో లెక్కించనున్నామని ఈఓ పి.ప్రభాకరరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల భక్తులు హుండీ లెక్కింపులో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అవతారమూర్తి జగన్నాథుడు

రథయాత్రలో భాగంగా జగన్నాథ స్వామివారు రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నాడు. స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



బరంపురం: కోర్టుపేట జంక్షన్‌లో నరసింహ స్వామి అవతారంలో జగన్నాథుడు



బరంపురం: గుసానినువాగంలో భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథుడు, బలభద్ర, సుభద్రలు



రాయగడ: వామన అవతారంలో జగన్నాథుడు, పక్కనే సుభద్ర, బలభద్రుడు



చిన్న బజార్ జంక్షన్‌లో నరసింహ స్వామి అవతారంలో జగన్నాథుడు



పర్లాకిమిడి: వామన, పరశురాముని అవతారాల్లో జగన్నాథుడు, బలరాములు



బరంపురం: గుండిచా మందిరంలో నరసింహ స్వామి అవతారంలో దర్శనమిస్తున్న జగన్నాథ స్వామి

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న పోలీసులు, యువకులు

రాయగడ: రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని, అపోహలు వీడి రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక పిలుపునిచ్చారు. ఉత్కళమణి గోపబంధుదాస్ జయంతి వారోత్సవాల్లో భాగంగా సమాజ్ సంస్థ ఆధ్వర్యంలో పోలీసుస్టేషన్‌లో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదాతలు ప్రాణదాతలని పేర్కొన్నారు. రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రాయగడ పోలీసుస్టేషన్ ఐఐసీ కమలాకాంత కుహారొ, సమాజ్ ప్రతినిధి రఘునాథ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో మొత్తం 27 యూనిట్ల రక్తాన్ని సేకరించి స్థానిక బ్లడ్ బ్యాంక్‌కు తరలించారు.

ఛెలిగడ ప్రాజెక్టు పరిశీలన

పర్లాకిమిడి: జిల్లాలో ఆర్.ఉదయగిరి సమితి ఛెలిగడ గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న ఛెలిగడ జల విద్యుత్ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులను కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ ఆదివారం పరిశీలించారు. ఈ ప్రాజెక్టును సుమారు రూ.936.63 కోట్లతో ప్రభుత్వం నిర్మిస్తోంది. ప్రాజెక్టు పనుల్లో అతి ముఖ్యమైన 1,280 మీటర్ల టన్నెల్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తైతే పొరుగున ఉన్న గంజాం జిల్లాకు 5,760 హెక్టార్లు, గజపతి జిల్లాలో 500 హెక్టార్ల పొలాలకు సాగునీరు అందుతుంది. అంతే కాకుండా ఈ ప్రాజెక్టు ద్వారా గజపతి జిల్లాలో శియ్యాలి లొట్టి, కోనకోత్తా, డెక్కిలి వంటి మూడు గ్రామాలకు 36 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి సరఫరా చేయగలదు. అయితే ఈ ప్రాజెక్టు ద్వారా నిర్వాసిత గ్రామాలకు నష్ట పరిహారం, ఇళ్ల మంజూరు ఇంతవరకూ జరుగలేదు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ ప్రాజెక్టు అధికారులకు ఆదేశించారు. ఆయనతో పాటు డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రమాంచల్ ఖమారీ, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిరేంద్ర కుమార్ దాస్ తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తదితరులు

సమష్టి కృషితోనే వర్సిటీ ప్రగతి



వ్యవస్థాపక దినోత్సవ న్యూస్ బులిటెన్ విడుదల చేస్తున్న దృశ్యం

- బీఆర్ఏయూ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు
- ఘనంగా విశ్వ విద్యాలయం వార్షికోత్సవం

ఎచ్చెర్ల క్యాంపస్: అందరి కృషితోనే బీఆర్ఏయూ ప్రగతి సాధిస్తోందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం 16వ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం వర్సిటీలో నిర్వహించారు. ఈ సందర్భంగా సెమినార్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ 15 ఏళ్లు పూర్తిచేసుకున్న విశ్వవిద్యాలయం సీనియర్ వర్సిటీలతో పోటీ పడి మంచి విద్యను అందజేస్తోందని తెలిపారు. విశ్వ విద్యాలయంలో పీజీ కోర్సులతో పాటు అనుబంధంగా 120 డిగ్రీ, పీజీ, బీఎడ్, డీపీఈడీ, బీపీఈడీ కళాశాలలు ఉన్నాయని చెప్పారు. భవిష్యత్‌లో నాక్ ఏ ప్లస్ గ్రేడ్ లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. పరిశోధనాత్మక విద్య, ఆవిష్కరణలే లక్ష్యంగా సాగుతున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న ఉన్న సిబ్బందితోనే పీజీ కోర్సులు, డిప్లమా, సర్టిఫికెట్, ఆన్‌లైన్ శిక్షణ కోర్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వర్సిటీలో పూర్తి స్థాయి మౌలిక వసతులు, ప్రమాణాల విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారం, అంతర్గత వనరులతో వర్సిటీ ముందుకు సాగుతోందని అన్నారు. అందరి సహకారంలో వర్సిటీ భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో ఉత్తమ వర్సిటీగా మారుతుందని అన్నారు. బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.లోకేశ్వరి రూ.లక్ష కార్పస్ ఫండ్ అందజేశారని, ఈ వడ్డీతో ఏటా బయోటెక్నాలజీలో ప్రథమ స్థానం విద్యార్థికి గోల్డ్ మెడల్ అందజేయనున్నట్లు వివరించారు. స్థానిక వర్సిటీకి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారం అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ప్రొఫెసర్ చింతాడ రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.అనురాధ పాల్గొన్నారు. వర్సిటీలోని జర్నలిజం విభాగం రూపొందించిన వ్యవస్థాపక దినోత్సవ న్యూస్ బులెటెన్ విడుదల చేశారు.

ఆదిత్యాయ నమోస్తుతే



సూర్యనమస్కార పూజలను చేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి ఆదిత్యుని ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆషాడ మాసం ఆదివారం సందర్భంగా భక్తులు భారీ గా తరలి వచ్చి కేశఖండన శాలలో తలనీలాలను సమర్పించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. అలాగే ప్రత్యేక ప్రసాదాలను స్వామికి నివేదించి ఆరోగ్యాన్ని ప్రసాదించమని మొక్కుకున్నారు. అనంతరం స్వామి దర్శనానికి వెళ్లి గోత్రనామాలతో పూజలు జరిపించుకున్నారు. భక్తుల కోసం ఆలయంలో ఉచిత ప్రసాదాల పంపిణీ, మంచినీటి ప్యాకెట్లతో పాటు ఉచిత మజ్జిగ పంపిణీ తదితర చర్యలను ఆలయ ఈఓ హరిసూర్యప్రకాష్ చేపట్టారు. ఉదయం 10 గంటల నుంచి భక్తుల సంఖ్య పెరగడంతో తగిన ఏర్పాట్లు చేసి ప్రత్యేక, విశిష్ట దర్శనాల ద్వారా దర్శనాలకు అవకాశమిచ్చారు. వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.3,12,100, విరాళాల ద్వారా రూ.84,012, ప్రసాదాల విక్రయా ల ద్వారా రూ.2.55 లక్షల మేరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ హరిసూర్యప్రకాష్ తెలిపారు.

కన్నపేగును కలిసిన వేళ

పదిహేనేళ్లుగా ఆ మాతృమూర్తి కొడుకును చూడలేదు.. తన ఇంటికి వెళ్లలేదు.. కుటుంబాన్ని కలవలేదు. మరోవైపు ఇన్నాళ్లుగా ఆ కొడుకు అమ్మను వెతుకుతూనే ఉన్నాడు. నేడో, రేపో తల్లి ఇంటికి రాకపోదా అని ఆశగా ఎదురుచూస్తూనే ఉన్నాడు. అనునిత్యం అమ్మ కోసం తాపత్రయపడ్డాడు. 15 ఏళ్ల ఎడబాటు తర్వాత ఆ తల్లీకొడుకులు మళ్లీ కలిశారు. మతిస్థిమితం కోల్పోయిన ఆ తల్లి అయినవాళ్లందరికీ దూరమైపోగా స్వచ్ఛంద సంస్థల సహకారంతో మళ్లీ మామూలు మనిషై కన్నపేగును కలుసుకుంది. వివరాల్లోకి వెళితే..



వృద్ధాశ్రమంలో ఉన్న తల్లిని తీసుకెళ్తున్న కుమారుడితో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు గ్రామానికి చెందిన గండుపల్లి లక్ష్మి(55) పదిహేనేళ్ల కిందటి వరకు అందరి లాగానే సాధారణ గృహిణిగా జీవితం గడిపేవారు. భర్త, కుమారుడితో కలిసి సంతోషంగా ఉండేవారు. అయితే భర్త మరణంతో ఆమె మానసిక స్థితి దారి తప్పింది. ఆ ఒత్తిడిలో కొడుకు కామదాసును విడిచిపెట్టి వెళ్లిపోయింది. మతిస్థిమితం లేకపోవడంతో ఆమె ఎటో వెళ్లిపోయారు. వెతికి పట్టుకోవడం ఇంటి వారికి సాధ్యపడలేదు. రోడ్లపై తిరుగుతున్న ఆమెను రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు ఆదరించి ఆరు నెలలుగా వైజాగ్‌లో చికిత్స చేయించారు. పరిస్థితి కాస్త కుదుటపడిన తర్వాత మనోబంధు సంస్థకు అప్పగించగా.. వారు మూడు రోజుల కిందట మండలంలోని సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి తీసుకువచ్చారు. ఆమెతో పాటు మరో నలుగురు ఇక్కడకు వచ్చారు. వారి నుంచి వివరాలు సేకరించిన ఫౌండేషన్ సభ్యులు పత్రికలు, సోషల్ మీడియాల్లో ఆ వివరాలను వెల్లడించారు. ఆ సమాచారం మొగల్తూరులోని కామదాసుకు చేరడంతో తన తల్లి కంచిలి మండలంలో ఉందని తెలిసి సంతోషపడ్డాడు. రెడ్‌క్రాస్ సభ్యులను సంప్రదించి కంచిలి మండలానికి వచ్చి ఆదివారం తల్లిని కళ్లారా చూశాడు. ఆమె కూడా కొడుకును గుర్తు పట్టడంతో ఆ ఉద్వేగ సన్నివేశాన్ని చూసి స్థానికులు కంటనీరు పెట్టుకున్నారు. అనంతరం ఆయన తన తల్లిని స్వగ్రామానికి తీసుకువెళ్లాడు. తల్లీకొడుకులను కలిపిన మనోబంధు సంస్థ కన్వీనర్ బీన ఢిల్లీ రావు, సూపర్‌వైజర్ పాల సురేష్, రెడ్‌క్రాస్ సంస్థ షెల్టర్ మేనేజర్ ఎ.మురళి, సీతయ్య ఫౌండేషన్ సభ్యుడు సానా గణేష్‌లకు సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుళ్ల రమేష్-మోహనరావులు ధన్యవాదాలు తెలిపారు.

– కంచిలి

సిక్కోలు లెజెండ్ రాజగోపాలరావు

- బొడ్డేపల్లి శత జయంతి ఉత్సవాలకు సీఎం చొరవ అభినందనీయం: స్పీకర్ తమ్మినేని సీతారాం
- వంశధార ప్రాజెక్టు రాజగోపాలరావు చలవే: మంత్రి ధర్మాన
- ఘనంగా బొడ్డేపల్లి శతజయంతి ఉత్సవాల ముగింపు



శతజయంతి ఉత్సవాల ముగింపు సభలో స్పీకర్ తమ్మినేని, మంత్రి ధర్మాన, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, తదితరులు



బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహం ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా బొడ్డేపల్లి రాజగోపాలరావు సేవలు అందించారని, ఆయన సిక్కోలు లెజెండ్ అని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆరుసార్లు పార్లమెంట్‌కు ఎన్నికయ్యారని, విజయనగరం రాజులపైనా ఇండిపెండెంట్‌గా పోటీ చేసి విజయం సాధించారని గుర్తు చేశారు. బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ముగింపు ఉత్సవాలను కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ కూడలిలో రాజగోపాలరావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో స్పీకర్ మాట్లాడారు. బొడ్డేపల్లి శతజయంతి ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించడం హర్షణీయమన్నారు. రాజగోపాలరావు అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు.

రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ విశిష్ట వ్యక్తి బొడ్డేపల్లి రాజగోపాలరావు అని, ఆయన శత జయంత్యుత్సవాలను వందరోజుల పాటు నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. బొడ్డేపల్లి ఔన్నత్యాన్ని కొత్త తరానికి తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమని తెలిపారు. వంశధార ప్రాజెక్ట్‌కు బొడ్డేపల్లి రాజగోపాల్ పేరు పెట్టాడం వైఎస్సార్ చలువేనన్నారు. వంశధార ప్రాజెక్టు రాజగోపాలరావు చలవేనని తెలిపారు. తనకు 26 ఏళ్ల వయసు ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా పోటీ చేయించాలని తన గురువు డోల సీతారాంకు బొడ్డేపల్లి చెప్పారని గుర్తు చేసుకున్నారు. 1989లో మంత్రి అయినప్పుడు శుభాకాంక్షలు చెప్పారని అన్నారు. నాలుగేళ్లలో సీఎం ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, వాటిని ఓర్వలేకే ప్రతిపక్షం విమర్శలు చేస్తోందని అన్నారు. మూలపేట పోర్టు, బుడగట్లపాలెం హార్బరు పూర్తయితే స్థానికంగానే ఉపాధి దక్కుతుందన్నారు.

ఎంపీ కె.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ బొడ్డేపల్లి రాజగోపాలరావు సిక్కోలు కీర్తిని చాటిచెప్పారన్నారు. శ్రీకాకుళం యువత ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధికతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్యే కంబాల జోగులు, మాజీ ఎంపీ కిల్లి కృపారాణి మాట్లాడుతూ బొడ్డేపల్లి సేవలను గుర్తు చేసుకున్నారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ మాట్లాడుతూ వంశధార ప్రాజెక్టు తీసుకొచ్చిన రాజగోపాలరావు విగ్రహం పక్కన జలగం వెంగళరావు విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, పార్టీ నాయకులు పిరియా సాయిరాజ్, దువ్వాడ వాణి రోణంకి గోపాలకృష్ణ, హనుమంతు కృష్ణారావు, కూన రవి, బొడ్డేపల్లి సత్యవతి, పైడి వేణుగోపాలరావు, పైడి మహేశ్వరరావు, సువ్వారి గాంధీ, కిల్లి మన్మథరావు, బల్ల గిరిబాబు, చింతాడ రామ్మోహన్‌రావు, కోత తిరుమలరావు, పూడి తిరుపతిరావు, చౌదరి పురుషోత్తంనాయుడు, సీఐటీయూ గోవిందరావు, పేడాడ రమణి, కిల్లి వెంకట సత్యనారాయణ, ధానేటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొడ్డేపల్లి నేతాజీ రచించిన బొడ్డేపల్లి రాజగోపాలరావు జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఉల్లాసంగా ఆట్యా-పాట్యా జిల్లా జట్ల ఎంపికలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఆట్యా-పాట్యా జిల్లా జట్ల ఎంపికలు ఉల్లాసంగా జరిగాయి. జిల్లా సమన్వయకర్త బాడాన నారాయణరావు ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో నిర్వహించిన ఎంపికల్లో ఒక్కో జట్టుకు 14 మంది చొప్పున బాల బాలికలను ఎంపిక చేశారు. వీరంతా వచ్చే నెల 1,2 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా తునిలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో కేకే రామిరెడ్డి, జగ్గమ్మ, లక్ష్మణరావు, రాజా, వెంకటేశ్వరరావు, నీలకంఠేశ్వరరావు, రఘునాథరావు, అలివేలు, రాణి, శ్యామలరావు, జానకి తదితర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆట్యా-పాట్యా బాలబాలికల జిల్లా జట్లు

క్లుప్తంగా

ఫేక్ ఐడీతో రైల్వే రిజర్వేషన్లు

● దాడులు చేసిన ఇంటెలిజెన్స్ అధికారులు

రాజాం/సంతకవిటి: రాజాం పట్టణంతో పాటు సంతకవిటి మండలంలో పలుచోట్ల ఫేక్ ఐడీలతో రైల్వే రిజర్వేషన్ చేస్తున్న దొంగలను భువనేశ్వర్ ఐఆర్‌టీసీ ఇంటెలిజెన్స్ అండ్ విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. సంతకవిటి మండలం మండాకురిటి రైతు భరోసా కేంద్రం వద్ద ఓ యువకుడు ఫేక్ ఐడీలతో రైల్వే రిజర్వేషన్లు చేస్తున్నాడు. ఈ విషయాన్ని రైల్వే ఇంటెలిజెన్స్ బృందం గుర్తించి శనివారం మెరుపుదాడిచేసింది. ఈ ఘటనలో రైతు భరోసా కేంద్రం వద్ద కంప్యూటర్ సిస్టమ్‌తో పనిచేస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకుని వస్తుసామగ్రిని బృందం సీఐ టీకే నాయక్ సీజ్‌చేశారు. అక్కడి నుంచి యువకుడు అందించిన సమాచారం మేరకు సంతకవిటి మండలంలోని కొండగూడెంతో పాటు రాజాం పట్టణంలో ఉంటున్న మరో యువకుడిని అదుపులోకి తీసుకుని కంప్యూటర్ సామగ్రిని సీజ్‌చేసి కేసులు నమోదు చేసినట్లు రైల్వే ఇంటెలిజెన్స్ పోలీసులు వెల్లడించారు. ప్రబల్ డేటా ఆధారంగా రాజాం, సంతకవిటి మండలంలో ఈ మోసాలు చేస్తున్నట్లు గుర్తించామని పోలీసులు వెల్లడించారు. ఎనిమిది ఫేక్ ఐడీలతో ఈ యువకులు ఇలా రిజర్వేషన్లు చేసి తప్పుడు మార్గంలో అక్రమార్జన చేస్తున్నారన్నారు. వారిపై కేసులు నమోదుచేసి క్రైమ్ ఇన్విస్టిగేషన్ టీమ్‌కు అప్పగిస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా మండాకురిటి రైతు భరోసా కేంద్రం వద్ద పోలీసులకు పట్టుబడిన యువకుడి వివరాలపై సంతకవిటి వ్యవసాయశాఖ అధికారి నవీన్ వద్ద సాక్షి ప్రస్తావించగా, ఆ యువకుడు తమ డిపార్ట్‌మెంట్‌కు చెందిన వ్యక్తికాదని ఖండించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

బొబ్బిలి: మండలంలోని పారాదికి చెందిన సూర్రెడ్డి గౌరీశ్వరి(35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. టీకొట్టు నడుపుతున్న భర్త రవితో కలిసి రామభద్రపురంలోని చర్చికి ఆదివారం ఆమె వెళ్లింది. అక్కడి నుంచి భర్తను విడిచిపెట్టి ముందుగా ఇంటికి వచ్చేసింది. ఆ తరువాత భర్త రవి ఇంటికి వచ్చేసరికి అపస్మారక స్థితిలో గౌరీశ్వరి ఉంది. దీంతో స్థానికులను పిలిచి 108 అంబులెన్స్‌కు సమాచారమందించాడు. వెంటనే వచ్చిన అంబులెన్స్ సిబ్బంది పడిపోయి ఉన్న గౌరీశ్వరిని పరిశీలించి మృతి చెందినట్టు ధ్రువీకరించారు. అనంతరం మృతురాలి కన్నవారి గ్రామమైన రామభద్రపురం మండలం మర్రివలసకు మృతదేహాన్ని అంత్యక్రియల కోసం తరలించారు. అక్కడి ఆర్‌ఎంపీ మృతదేహాన్ని పరిశీలించి తలపై గాయాలున్నట్లు గుర్తించాడు. దీంతో వెంటనే మృతదేహాన్ని తిరిగి బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, పూర్తి వివరాలు తెలియజేస్తామని సీఐ ఎం.నాగేశ్వర రావు తెలిపారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి గాయత్రి కాలనీకి చెందిన రెడ్డి దుర్గారావు ఆన్‌లైన్ మోసగాళ్ల బారిన పడి రూ.1.16 లక్షలు పోగొట్టుకున్నాడు. దీనికి సంబంధించి సీఐ కె.రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుర్గారావుకు ఈనెల 21న మధ్యాహ్నం 812774206 నంబర్ నుంచి ఫోన్‌చేసి ఆర్‌బీఎల్ బ్యాంకు సిబ్బంది మాట్లాడినట్లు మాట్లాడారు. క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుకునేందుకు అర్హుడివని చెప్పడంతో దుర్గారావు అంగీకరించాడు. దీంతో వారు వాట్సాప్ (9120028195) నంబర్‌కు పంపించిన లింకును ఓపెన్ చేసి క్రెడిట్ కార్డు నంబర్‌తో పాటు సీవీవీ పిన్ వివరాలు నమోదు చేయమనడంతో చేశాడు. దీంతో వెంటనే రెండు ఓటీపీలు వచ్చి, ఆటోమేటిక్‌గా ఎంటర్ అయి కార్డు నుంచి రెండు అమౌంట్‌లు డెబిట్ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. ఒక మెసేజ్‌లో రూ.98వేలు, మరో మెసేజ్‌లో రూ.18వేలు మొత్తం రూ. 1.16 లక్షలు కార్డు నుంచి డెబిట్ అయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. వెంటనే అది మోసపూరిత ఫోన్‌కాల్‌గా గుర్తించి ఆర్‌బీఎల్ బ్యాంకు సిబ్బందికి విషయం చెప్పి కార్డును బ్లాక్ చేయించాడు. అనంతరం సైబర్ క్రైమ్‌కు ఫోన్‌చేసి వివరాలు వెల్లడించడంతో వారు చెప్పిన విధంగా కంప్లెయింట్ చేశాడు. జాతీయ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో కేసు రిజిస్టర్ చేసిన అనంతరం రాజాం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు దుర్గారావు ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు.

అశాస్త్రీయ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

విజయనగరం అర్బన్: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న అశాస్త్రీయ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు అభిప్రాయ పడ్డారు. శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖకు ఇచ్చే కేటాయింపుల విషయంలో కోత విధించడమే కాకుండా అశాస్త్రీయ అంశాలను ఉన్నత విద్యలో కోర్సులుగా ప్రవేశ పెట్టడం సిలబస్‌లో మార్పులు చేయడం వంటి చర్యలు చేపట్టి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఎ (హెచ్)లో చెప్పిన శాస్త్రీయ దృక్పథం అన్న స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ కేంద్రప్రభుత్వం అనేక ఏకపక్ష నిర్ణయాలను తీసుకోవడం అభ్యంతరకరమని స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న ప్రగతి శీల సంఘాల ప్రతినిధులు డాక్టర్ ఎంవీఎస్‌ప్రసాద్ (పూర్వ ఐఎంఏ అధ్యక్షులు), జి.మురళీధర్, డాక్టర్ ఎంవీఎస్ వెంకట్రావు, జె.రమేష్ పట్నాయక్ (యూటీఎఫ్) తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న అభ్యర్థులు



సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌సీ ఎగ్జామ్ సంస్థ చైర్మన్ కిరణ్‌కుమార్



ఎగ్జామ్ రాస్తున్న అభ్యర్థులు

సాధనమున సమకూరు విజయం..!



బహుమతి అందుకుంటున్న తాడి ముకుంద

● సృజనాత్మకత..అభ్యసనతో పోటీ పరీక్షల్లో రాణింపు
● గ్రూప్–2 పోటీ పరీక్షల అవగాహన సదస్సులో వక్తలు

విజయనగరం అర్బన్: మారుతున్న పోటీ పరీక్షల సిలబస్ సరళికి అనుగుణంగా చేసే సాధనతోనే విజయం సాధ్యమవుతుందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. పోటీ పరీక్షల్లో రాణించాలంటే అభ్యసనకు సృజనాత్మకత తోడు కావాలని ఆ దిశగా శిక్షణ పొందాలని పిలుపునిచ్చారు. సాక్షి మీడియా గ్రూప్, హైదరాబాద్ ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక హోటల్ ఆనంద్ గ్రాండ్ ఫోర్ట్‌లో గ్రూప్–2 పోటీ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఇప్పటికే లక్షల సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం త్వరలో ఏపీపీఎస్‌సీ ద్వారా పెద్ద సంఖ్యలో గ్రూప్–2 కేడర్ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థుల్లో పోటీ పరీక్షలకు తగ్గట్లు నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు నిపుణులైన అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ కరీం (హిస్టరీ), బి.కృష్ణారెడ్డి (పాలిటీ), ఎం.డి పాషా (ఎకనామీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), టి.రవి (కరెంట్ ఎఫైర్స్) హాజరై అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. తొలుత ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ ఎం.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన లెజండరీ ఫ్యాకల్టీతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఆన్‌లైన్ విధానంలో వేల మంది అభ్యర్థులు తమ వద్ద శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. సాక్షి శ్రీకాకుళం యూనిట్ బ్రాంచ్ ఇన్‌చార్జ్ బెహరా స్వామి మాట్లాడుతూ పోటీ పరీక్షల అభ్యర్థులకు సాక్షి భవిత, సాక్షి ఎడ్యుకేషన్.కామ్ ద్వారా ప్రామాణికమైన మెటీరియల్ అందిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులు ఇలాంటి అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ అల్లు సూరిబాబు మాట్లాడుతూ లక్ష్యంతో ముందుకెళ్తూ ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తే విజయం సాధించవచ్చని తెలిపారు. విజయనగరం సాక్షి ఎడిషన్ ఇన్‌చార్జ్ పీసీహెచ్.అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ పరీక్షల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులను సైతం ఉన్నత శిఖరాలు అధిరోహించి ఉజ్వల భవితకు సాక్షి భవిత ద్వారా మార్గం చూపుతున్నామన్నారు. అనంతరం అభ్యర్థులకు నమూనా టాలెంట్ టెస్ట్ నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు నగదు బహుమతి, పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందజేశారు. మరో 20 మందికి ప్రామాణిక స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో సాక్షి అడ్వర్‌టైజ్ మెంట్ మేనేజర్ రాపాక నగేష్, ఈవెంట్ మేనేజర్ మారుతి, సాక్షి అడ్వర్‌టైజ్ మెంట్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

కాన్సెప్ట్ ఓరియంట్ పరిజ్ఞానం పెంచుకోవాలి

కరెంట్ ఎఫైర్స్‌లో శతశాతం మార్కులు తెచ్చుకోవడానికి కాన్సెప్ట్ ఓరియంట్ పరిజ్ఞానం తప్పనిసరి. ఆ దిశగా ప్రయత్నించేందుకు ఏ రోజు కారోజు నోట్స్ తయారు చేసుకోవాలి. దినపత్రికలను తప్పనిసరిగా చదివి అందులో ప్రధాన అంశాలను నోట్స్‌గా చేసుకోవాలి. కరెంట్ ఎఫైర్స్ ప్రశ్నల కోసం ప్రత్యేకించి పుస్తకాలు చదవడం కంటే ఈ ప్రక్రియ మంచి ఫలితాలను ఇస్తుంది. మిగిలిన అన్ని సబ్జెక్టుల నుంచి కరెంట్ ఎఫైర్ ప్రశ్నలు వస్తాయి. వాటిలో కూడా ఇదే విధంగా ఓరియంటల్‌గా ప్రిపరేషన్ చేయాలి.

టి.రవి, కరెంట్ ఎఫైర్స్

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరం



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ సదస్సు వరంగా నిలిచింది. గ్రూప్–2 పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే అభ్యర్థులు తీసుకోవాల్సిన అంశాలపై నిపుణులైన ఫ్యాకల్టీ చక్కగా చేసిన మార్గనిర్దేశం. ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. పోటీ పరీక్షలకు తొలిసారిగా హాజరయ్యే అభ్యర్థులు సైతం తక్కువ సమయంలో ఎలా విజయం సాధించవచ్చో అర్థమయ్యేలా చక్కగా వివరించారు.

–తాడ్డి ముకుంద, చంద్రంపేట, నెల్లిమర్ల

అత్యుత్తమంగా గ్రూప్-2 శిక్షణ

పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో రాష్ట్రంలోనే అత్యుత్తమ శిక్షణను ఆర్‌సీ సంస్థ ద్వారా అందిస్తున్నాం. రాష్ట్రంలోని అత్యుత్తమ ఫ్యాకల్టీలందరూ మా సంస్థలో బోధిస్తున్నారు. వారి సహకారంతో ఈ నెల 19 నుంచి ఏపీపీఎస్‌సీ గ్రూప్–2 బ్యాచ్‌కు ప్రవేశాలు ప్రారంభించాం. హైదరాబాద్ రాలేని ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు, ఇతర విద్యార్థుల కోసం ఎగ్జామ్స్ మొబైల్ యాప్ ద్వారా తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో శిక్షణ అందిస్తాం. పూర్తి వివరాల కోసం 8985093399, 8985094499 నంబర్లకు సంప్రదించాలి.

– ఎం.కిరణ్‌కుమార్, చైర్మన్ ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ, హైదరాబాద్

ఎక్కువ సార్లు సాధన చేయడమే విజయ రహస్యం

పోటీ పరీక్షల లక్ష్య సాధనకు తీసుకునే క్రమశిక్షణ చర్యల్లో సిలబస్‌ను ఎక్కువ సార్లు సాధన చేయడం కీలకమైనది. అదేవిధంగా గైడెన్స్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇతరుల అనుభవాలను తీసుకోవడం ద్వారా లక్ష్యాన్ని సాధించవచ్చు. విజేతల బయోగ్రఫీలతోపాటు పరాజితుల ఇంటర్వ్యూలను ఆదర్శంగా తీసుకోవాలి. ఏమి చేయాలో ఏమి చేయకూడదో తెలుసుకుంటే విజయం తథ్యం. సంక్షిప్తత నుంచి సరళత్వం దిశగా సాధన ఉండాలి. నాణ్యమైన కంటెంట్, సిలబస్‌ను లోతుగా చదవాలి. ఎక్కువసార్లు సాధన చేయడమే విజయ రహస్యం.

–పి.హరికృష్ణ, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ

ఉన్న ఊరిలో ఉపాధి

● లక్ష్యానికి చేరువగా నిర్దేశించిన పనిదినాలు
● పనిదినాల కల్పించాల్సింది 1.97కోట్లు
● ఇప్పటి వరకు పూర్తయినవి 1.23 కోట్లు
● ఉత్సాహంగా పని చేస్తున్న వేతనదారులు



గంట్యాడ మండలం పెదవేమలిలో పనులు చేస్తున్న వేతనదారులు

విజయనగరం ఫోర్ట్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అతి తక్కువ సమయంలో డ్వామా అధికారులు చేరువవుతున్నారు. లక్ష్య సాధనకు ఇంకా 9 నెలల సమయం ఉన్నప్పటికీ ఇప్పటికే బాగా చేరువయ్యారు. పనిదినాల కల్పనలో రాష్ట్ర స్థాయిలో విజయనగరం ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధికారులు శతశాతం సాధించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో1.97కోట్ల పనిదినాలు వేతనదారులకు కల్పించాల్సి ఉండగా ఇంతవరకు 1.23 కోట్ల పనిదినాలు కల్పించారు. ఉన్న ఊరిలోనే ఉపాధి దొరుకుతుండడంతో వేతనదారులు కూడా ఉత్సాహంగా పనుల్లో పాల్గొంటున్నారు.

రోజుకు సగటున 1.52 లక్షల మందికి పని

ఉపాధిహామీ పథకం ద్వారా రోజుకు లక్ష మందికి పైగా జిల్లాలోని వేతనదారులకు పని కల్పిస్తున్నారు. వేతనదారులకు పని కల్పించడంలో రాష్ట్రస్థాయిలో విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. గడిచిన మూడు నెలల్లో రోజుకు సగటున 1.52 లక్షల మంది వేతనదారులకు పని కల్పించారు. ఇంతవరకు రూ.298.25 కోట్లు వేతన రూపంలో చెల్లించారు.

జిల్లాలో జాబ్ కార్డులు 3.45 లక్షలు

జిల్లాలో జాబ్ కార్డులు 3.45లక్షలు ఉన్నాయి. వాటిలో యాక్టివ్ జాబ్ కార్డులు 3.17 లక్షలు. వేతనదారులు 6.98 లక్షల మంది ఉన్నారు. వారిలో 6.06 లక్షల మంది మాత్రమే పనులకు వెళ్తున్నారు.

సాఫీగా కుటుంబపోషణ

ఉన్న ఊరిలో పనిదొరకడంతో పాటు పనికి సంబంధించిన వేతనాలు కూడా సకాలంలో వేతనదారులకు ప్రభుత్వం చెల్లిస్తోంది. వారానికి రూ.1400 నుంచి రూ.1600 వరకు వేతనదారుడికి పేమెంట్ అందుతోంది. దీంతో వేతనదారుడి కుటుంబ పోషణ సాఫీగా సాగిపోతోంది.

మండలాల్లో గరివిడి ప్రథమ స్థానం

ఉపాధిహామీ వేతనదారులకు పని కల్పించడంలో జిల్లాలో గరివిడి మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. గడిచిన మూడు నెలల్లో 6.97 లక్షల మంది వేతనదారులకు పని కల్పించారు. అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన గుర్లలో 6.49 లక్షల మంది వేతనదారులకు పని కల్పించారు.

ఎన్ఎంఎంఎస్ యాప్‌లో పనివివరాల నమోదు

ఉపాధిహామీ వేతనదారులకు సంబంధించి మస్టర్లను నూతన విధానంలో నమోదు చేస్తున్నారు. గతంలో పనికి వచ్చే వేతనదారుల వివరాలు పేపర్‌పై నమోదు చేసేవారు. ఇప్పుడు దానికి స్వస్తి పలికారు. నేషనల్ మస్టర్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) యాప్‌ద్వారా వేతనదారుల వివరాలు నమోదు చేస్తున్నారు. వేతనదారులకు పనిచేసే చోట ఫొటో తీసి ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేస్తారు. దీని వల్ల పనికి రాకుండా వచ్చినట్లు మస్టర్ వేసుకునే అవకాశం ఉండదు. బినామీ మస్టర్లకు పూర్తిగా చెక్ పడుతుంది.

3 నెలల్లోనే 1.23 కోట్ల పనిదినాలు



లక్ష్య సాధనకు ఇంకా 9 నెలలు సమయం ఉన్నప్పటికీ ఈఏడాది 3 నెలల్లోనే 1.23 కోట్ల పనిదినాలు కల్పించారు. వేతనదారులు అధిక సంఖ్యలో పనులకు వస్తున్నారు. వేతనదారులకు పేమెంట్ కూడా బాగా వస్తోంది.

జి. ఉమాపరమేశ్వరి, పీడీ, జిల్లా నీటియాజమాన్య సంస్థ

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



రన్‌లో పాల్గొన్న క్రీడాకారులు, క్రీడాభిమానులు

● ప్రారంభించిన ఎమ్మెల్సీ రఘువర్మ
● అధిక సంఖ్యలో పాల్గొన్న క్రీడాకారులు, క్రీడాభిమానులు

విజయనగరం: అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా జరిగింది. నగరంలోని రాజీవ్ స్టేడియం నుంచి కోట వరకు నిర్వహించిన రన్‌లో అధిక సంఖ్యలో క్రీడాకారులు, క్రీడాభిమానులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. రన్‌లో పాల్గొన్న వారందరికీ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన టీ షర్టులు, టోపీలు అందజేశారు. అంతకుముందు రాజీవ్ స్టేడియంలో ఒలింపిక్ డే రన్‌ను ఎమ్మెల్సీ పాకల పాటి రఘువర్మ క్రీడా జ్యోతి వెలిగించి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రారంభమైన ర్యాలీ కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్, గంటస్తంభం జంక్షన్, మెయిన్‌రోడ్, మూడులాంతర్ల జంక్షన్, డీసీసీబీ రోడ్ మీదుగా కోట జంక్షన్ వరకు సాగింది. అంతకుముందు రాజీవ్ స్టేడియంలో సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, జాతీయ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను సత్కరించారు.

క్రీడాస్ఫూర్తి కలిగించేందుకే రన్

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ క్రీడా కారులలో సమానత్వం భావం కలిగించి, క్రీడా స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో విజయనగరం జిల్లా ముందువరుసలో ఉండేలా క్రీడలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్. వేణుగోపాలరావులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని హితవు పలికారు. క్రీడల వల్ల దేహదారుఢ్యంతో పాటు స్నేహసంబంధాలు మెరుగుపడతాయన్నారు. గ్రామస్థాయి నుంచే వివిధ విభాగాల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.సుభాష్ చంద్రబోస్, డోలా మన్మథకుమార్, కోలగట్ల ప్రతాప్, బొమ్మన రామారావు, ఏఎస్ఎం కమలనాభరావు, కేపీ బాలకృష్ణ, టీవీ భగవాన్ దాస్, కేవీఎన్ రాజు, కె.సన్యాసినాయుడు, కె.గోపాల్, వి.మల్లేశ్వరరావు, ఎలుగు బంటి రమణ, లీలా కృష్ణ, శ్రీనివాస్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్డి కుటుంబానికి హైకోర్టు జడ్జి పరామర్శ

● సన్యాశినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు



తాడ్డి సన్యాసినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆకుల శేషసాయి దంపతులు

గజపతినగరం: సీనియర్ రాజకీయ నాయకుడు మాజీ ఎమ్మెల్యే తాడ్డి సన్యాసినాయుడు ఇటీవల స్వర్గస్తులు కావడంతో ఆయన కుటుంబసభ్యులను హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆకుల శేషసాయి దంపతులు ఆదివారం పరామర్శించారు. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ఆకుల శేషసాయి, ఆయన సతీమణి గీత, విజయనగరం జిల్లా న్యాయమూర్తి కల్యాణ చక్రవర్తి, విశాఖ జిల్లా జడ్జి గోపి, బొబ్బిలి ఆర్డీఓ శేష శైలజ, స్థానిక తహసీల్దార్ ఎం.అరుణకుమారి తదితరులు అంతా వచ్చారు.ముందుగా సన్యాసినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి హైకోర్టు చీఫ్ జస్టిస్ నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు.

భావితరాలకు స్ఫూర్తిగా గురజాడ ఇల్లు తీర్చిదిద్దాలి



గురజాడ స్వగృహంలో ఆయన మునిమనుమడు ప్రసాద్‌తో మాట్లాడుతున్న జయప్రకాశ్ నారాయణ

● లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ్

విజయనగరం టౌన్: గురజాడకు తగినంతగా గుర్తింపు ఇవ్వడం లేదని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం గురజాడ స్వగృహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాకవి గురజాడ ఇంటిని లండన్‌లో షేక్‌స్పియర్ ఇంటి మాదిరిగానే తీర్చిదిద్దాలని, భావితరాలకు స్ఫూర్తిగా ఉండాలని అభిప్రాయ పడ్డారు. ప్రభుత్వం చేసినంత సాయం చేస్తుంది. మనం కొంత మంది ప్రైవేట్ వ్యక్తులతో కలిసి సామాజిక బాధ్యతగా అభివృద్ధికి పూనుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం గురజాడ స్వగృహమంతా కలియదిరిగారు. గురజాడ వాడిన బావి, కళ్లద్దాలు, పుస్తకాలు చూసి ఆనందించారు. రిజిస్టర్ బుక్‌లో సంతకం పెట్టి, ఎవరెవరు గురజాడ స్వగృహాన్ని సందర్శించారో వారి వివరాలను గురజాడ మునిమనుమలు వెంకటేశ్వరప్రసాద్, ఇందిరలు జయప్రకాశ్ నారాయణ్‌కు వివరించారు. అంతకుముందు ఓట్ ఇండియా సేవ్ డెమోక్రసీ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు భీశెట్టి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

మంచి రోజులు

● గిరిజన ఉత్పత్తులకు భలే ధర
● కొనుగోలు చేస్తున్న జీసీసీ
● దళారుల ఆగడాలకు చెక్



రైల్వేస్టేషన్లో ఏర్పాటు చేసిన ఆర్ఎండీ స్టాల్

పార్వతీపురం టౌన్: మన్యంలో గిరిపుత్రులకు మంచి రోజులు వచ్చాయి. జగనన్న పాలనలో గిరిజన ఉత్పత్తుల కొనుగోలుకు జీసీసీ తన వంతు ముమ్మర యత్రాలు చేస్తూ సఫలీకృతమవుతోంది. ఫలితంగా గిరిజనులకు ఆర్థిక ఊరట లభిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిత్యం దళారుల దోపిడీకి గురయ్యే గిరిజనులు ఇప్పుడు ఆ పరిస్థితుల నుంచి బయటపడ్డారు. తాము పండించే పంటను కారుచౌకగా మైదాన ప్రాంతం నుంచి వచ్చే దళారులకు అప్పగించి నిలువు దోపిడీకి గురయ్యేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజన సహకార సంస్థ (జీసీసీ)ని జగనన్న ప్రభుత్వం బలోపేతం చేసింది. ఇప్పుడు వారి సంపదకు వారే యజమానులు.. వారే ఉత్పత్తిదారులు. గిరిజనుల నుంచి మద్దతు ధరకు ముడి సరుకులను గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేస్తుండడంతో వారికి ఆర్థిక ఊరట లభిస్తోంది. ఇలా కొనుగోలు చేసిన సరుకులను మరింత నాణ్యమైన ఉత్పత్తులుగా మలచి జీసీఎంఎస్ ద్వారా తిరిగి జనం చెంతకు జీసీసీ చేర్చుతోంది. తక్కువ ధరలకే విక్రయిస్తూ అటు వినియోగదారులకు, ఇటు గిరిజనులకు లాభాల వారధిగా నిలుస్తోంది. దళారుల బారి నుంచి గిరిజనులను కాపాడుతూ అధిక ఆదాయం ఆర్జించి పెడుతూ ఏటా రూ.కోట్ల విలువైన వ్యాపారం సాగిస్తోంది. గత నాలుగేళ్లలో రూ.22.46 కోట్లు కొనుగోలు చేయగా ఈ ఒక్క ఏడాదే రూ.10.36 కోట్లను గిరిజనులకు అందించి ఆర్థిక ఊరటనిచ్చింది. 2023 – 24 సంవత్సరానికి రూ.8.27 కోట్ల గిరిజన ఉత్పత్తుల కొనుగోలును లక్ష్యంగా పెట్టుకుంది.

ఉత్పత్తులు ఇలా..

గిరిజనుల నుంచి తేనె, చింతపండు, నరమామిడి వంటి దాదాపు 26 రకాల అటవీ ఉత్పత్తులను ఏటా జీసీసీ కొనుగోలు చేస్తోంది. వాటిని కేంద్రాల్లో నిల్వ చేస్తోంది. ఏడు పారిశ్రామిక సదుపాయాల్లో ప్రాసెసింగ్ చేసిన అనంతరం ఉత్పత్తులను మార్కెట్లో వినియోగదారులకు అందుబాటులోకి తేవడమే దీని లక్ష్యం. పసుపు, కుంకుమ, తేనె, షరబత్, షాంపూలు, సబ్బులు, కాఫీ పొడి తదితర 27 ఉత్పత్తులను రిటైల్ ప్రత్యేక ఔట్లెట్లు, సూపర్ బజార్లు, రైతు బజార్లు, ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లా జీసీఎంఎస్ పరిధిలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో స్టాల్స్ పెట్టి విక్రయాలు నిర్వహించడమే కాకుండా మొబైల్ సేవల ద్వారా మారుమూల పల్లెలకు గిరిజన ఉత్పత్తులను చేరవేస్తోంది.

ఈ ఏడాది లక్ష్యం రూ.8.27 కోట్లు

పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పడిన తొలి సంవత్సరం గిరిజన ఉత్పత్తులకు మరింత మార్కెటింగ్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి రూ.10.36 కోట్ల విలువైన ముడి సరుకును కొనుగోలు చేశారు. వాటిని ఉత్పత్తులుగా మలచి మార్కెటింగ్ చేసేందుకు చర్యలు చేపట్టారు. పార్వతీపురం జీసీసీ పరిధిలో 102 డిపోల్లో గిరిజన ఉత్పత్తుల కొనుగోలుకు సంబంధించి గిరిజనులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. 2023 – 24 సంవత్సరానికి రూ.8.27 కోట్ల కొనుగోలును లక్ష్యంగా పెట్టుకుని కొనుగోలును ప్రారంభించారు.

ప్రతి గ్రామానికి చేరువ చేస్తున్నాం..



జీసీఎంఎస్‌కు మరింత ఆదాయం చేకూరేలా ఉత్పత్తులను గ్రామ స్థాయి ప్రజలకు అందేలా మొబైల్ సేవలను ప్రారంభించాం. ప్రధాన రైల్వేస్టేషన్లో రైల్వే అధికారులతో మాట్లాడి ఆర్ఎండీ స్టాల్స్‌ను ఏర్పాటు చేశాం. దీనివల్ల గిరిజనులు లబ్ధి పొందడమే కాకుండా ప్రభుత్వానికి మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రతి గ్రామానికి జీసీఎంఎస్ ఉత్పత్తులు సరఫరా అయ్యేలా మొబైల్ సేవలను విస్తృతం చేస్తాం. గిరిజనులు దళారుల చేతుల్లో మోసపోకుండా డిపోల ద్వారా ఉత్పత్తులను స్థానికంగా కొనుగోలు చేసి ఆర్థికంగా అండగా నిలుస్తున్నాం.

– మహేంద్రకుమార్, జీసీసీ డివిజనల్ మేనేజర్, పార్వతీపురం మన్యం